జ్యోతి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# తాజ్ మహల్

వల్లూరు శివప్రసాద్

బొకారో ఎక్స్‌ప్రెస్ చీకటిని చీల్చుకుంటూ వేగంగా దూసుకెళ్తోంది. ఇంజన్ రొద, పట్టాల శబ్దం కలగాపులగమై వింతగా ధ్వనిస్తూ నిశ్శబ్దాన్ని చీలుస్తోంది. కిటికీ అద్దాలనుండి బయటపడుతున్న కాంతి దూరంగా పడుతూ బండిని వెంబడిస్తున్నట్లుగా పరిగెడుతూంది.

నేనున్నది రిజర్వుడు కంపార్టుమెంట్ అయినా అది రద్దీగానేవుంది. సీట్లమీద, క్రింద జనం నిద్రలో తూగుతున్నారు. అసౌకర్యంగా వుండటంవలన ఎవరూ పూర్తిగా నిద్రపోలేక పోతున్నారు. తూలు వచ్చినప్పుడల్లా సర్దుకు కూర్చుని, తమ సామాను పరిశీలనగా చూసుకొని తిరిగి నిద్ర కుపక్రమిస్తున్నారు.

అదృష్టంకొలదీ నేను బెర్తు సంపాదించుకోగలిగినా నిద్రరావటంలేదు. గరగరమని తిరుగుతున్న ఫాన్‌రెక్కల శబ్దం మినహా కంపార్టుమెంట్‌లో మరే శబ్దం లేదు.

వారంక్రితమే రాఘవను కలిసిన నేను, వాణ్ణి కలసుకోవటానికి తిరిగి ఇంత త్వరగా వెళ్ళాల్సి వస్తుందనుకోలేదు. రాఘవ వుత్తరం చూసిన వెంటనే రెండురోజులు ఆఫీసుకు శలవు పెట్టి బయలుదేరాల్సివచ్చింది.

తెల్లవారుజాము నాలుగుగంటలైంది. బండి గంట లేటుతో నడుస్తుండటంవలన కావలి చేరటానికి ఇంకా మూడుగంటలు పడుతుంది.

క్రింద ఎవరో గురకపెడ్తున్న శబ్దం మెల్లగా వినిపిస్తుంది. ఏమీ తోచక రాఘవ రాసిన వుత్తరం బయటకు తీశాను. ఆ వుత్తరం అప్పటికే ఎన్నోసార్లు చదివాను. అయినా ప్రతి సారి క్రొత్తగా చదువుతున్నట్లే వుంది.

స్నేహితుడు సుందరానికి,

ఈ లోకంలో ఎన్నో సౌఖ్యాలనుభవిస్తూ సుఖపడేవారికంటే సమస్యల్ని, కష్టాల్ని ఎదుర్కొంటూ మనోవేదన ననుభవించేవారే ఎక్కువన్నది నువ్వు కాదనవనుకొంటాను. అంతటి దుఃఖాన్ననుభవిస్తూ ఎందరో బ్రతకగలుగుతున్నారంటే, కాస్తో కూస్తో ఎదుటివారి నుండి లభించే సానుభూతి, ఓదార్పే కొంత కారణమని నేను నమ్ముతాను.

కాని, నేను నీ నుండి సానుభూతి కోరుతూ మాత్రం ఇంతటి సుదీర్ఘమైన లేఖను రాయడంలేదు. అనవసరపు సోదంతా రాసి విసిగిస్తున్నానని నువ్వు భావించవనే నా వూహ. నమ్మకం కూడా.

సరిగ్గా మూడురోజుల క్రితం నువ్వు చంద్రపడియ నుండి రాజమండ్రి వెళ్తూ కావలిలో నన్ను వెతుక్కుంటూ ఇంటికొచ్చావు. చిన్ననాటి స్నేహితుణ్ణి ఎన్నో సంవత్సరాల తర్వాత చూడగలిగానని ఎంతో సంతోషం వేసింది.

కాని, నన్ను చూడాలన్న ఉద్దేశంతో మాత్రమే నా కోసం రాలేదన్న సంగతి నిజమేనని నువ్వూ అంగీకరిస్తావనుకొంటాను. మనం బండికోసం ప్లాట్‌ఫాం మీద వేచివున్న సమయంలో నువ్వు, చావుబ్రతుకుల్లో వున్న నాతల్లి గూర్చి చెప్పి ఏమీ సహాయం చెయ్యనందుకు కోపగించుకొన్నావు. నా అసమర్థతను వేలెత్తి

చూపావు. నా అసమర్థతను సమర్థించుకోవాలన్న ప్రయత్నంగా యీ లేఖను రాస్తున్నానని అనుకోవద్దు, దయచేసి.

ఏ మాత్రం ఆదరవులేక, ఆకులు రాలి ఎండి నానాటికి మోడులా వాడిపోతున్న నా తల్లిగూర్చి నీ కున్న ఆవేదనలో కనీసం ఒక వంతయినా కన్నకొడుకైన నాకు లేనందుకు నువ్వు ఆశ్చర్యపడివుంటావు. ఒక విధంగా అసహ్యించుకొంటున్నావనే అనుకొంటాను.

"రాఘవా! తల్లిదండ్రుల కష్టసుఖాలను పట్టించుకోనంత స్వార్థం మన జీవితం గురించి పెంచుకోవడం సహృదయతనిపించుకోదు. మన భావి జీవితంకోసం వాళ్ళు వేసిన పునాదుల్ని మర్చిపోవడం కృతజ్ఞతనిపించుకోదు" అని నువ్వంటే నా మనసు విలవిలలాడింది.

నా సంసారం గురించి నేను పెంచుకొన్న స్వార్థమే నా తల్లిని నాకు దూరం చేసిందని నువ్వనుకొని వుంటావు. నువ్వేకాదు, నా తల్లి దీనపరిస్థితిని కళ్ళారా చూసిన ఏ వ్యక్తయినా నీలానే నన్ను చీదరించుకొంటాడు. అది సర్వసాధారణం.

నిజమే! నా లాంటి దౌర్భాగ్యుడైన కొడుకును కన్న ఏ తల్లి మనసుకూడా హిమాలయాలంతటి వున్నతంగా ఎదగకుంటేగాని ఆమెకు మనశ్శాంతి లభించదు. ఆ హిమవన్నగము పాదాలచెంత సెలయేరులా పుట్టిన నేను పల్లాన్ని వెతుక్కుంటూ పాకేవాడ్నేగాని, ఎంత ప్రయత్నించినా శిఖరాన్ని అందుకోలేని నిర్భాగ్యుడ్ని.

అమ్మ మనసు హిమాలయాన్ని మించి వున్నతమైంది. అంతకంటే శీతలమైంది. నా జీవితం కోసం తనలోవున్న ఎంతటి శీతలాన్ని కరిగించి ధారపోసిందో గదా!

ఆ సెలయేరు తప్పటడుగులు వేస్తూ నదిలో కలసింది. అయినప్పటికీ నా తల్లి ప్రభావం నాలో వుంది గనుకనే నా యావ్వనదశ ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా గడిచిపోయింది.

ఆ కొద్ది సంవత్సరాల జీవితం నది నీటిలా తియ్యగా, స్వచ్ఛంగా, ప్రశాంతంగా, రమ్యంగా సాగిపోయింది. అది తిరిగిరాని జీవితం!

మరిప్పుడో—నది సాగి సాగి ప్రయాణించి సముద్రంలో కలిసిపోయింది. ఆ సముద్రం—ఉప్పగా, ఉవ్వెత్తున ఎగసే కెరటాల హోరుతో భయంకరమైన జలచరాలతో అల్లకల్లోలంగా వుండి భయకంపితుడ్ని చేస్తూంది.

ఈ జీవితంలో అనేకసార్లు వీచిన ప్రభంజనాల ప్రభావంతో, నా అనుభవాల కెరటాలు ఈడ్చిఈడ్చి మనసును తాకి దాని ఆకృతినే మార్చివేశాయి. ఆ నాటి నా ప్రశాంతజీవితం యిప్పుడు ఎంతో కల్లోలితమై వుంది.

సముద్రానికి,నదికీ వున్నంత తేడా ఆ నాటికి, ఈ నాటికి నా జీవితంలో ఏర్పడింది.

ఆ నాటి స్వచ్ఛతపోయి ఎంతో కృత్రిమత్వం నాలో వుప్పగా పేరుకుపోయింది. సముద్రంలో పడిన నదినీరు ఎదురుప్రవహించి తన తల్లి పాదాలను ఎలా తాకలేదో, అలాగే నా చుట్టూ ఎన్నో సమస్యలూ, బాధ్యతలు అడ్డుగా పేరుకొని నా తల్లికి నన్ను దూరం చేస్తున్నాయి.

పల్లానికి ప్రవహించే ప్రవృత్తి నీటికెలా వుందో, పరిస్థితులకు బానిసగా మారే స్వభావం మనిషికలా వుంది.

జబ్బుపడ్డ నా తల్లి మొదలు నరకబడుతున్న వృక్షంలా కూలడానికి సిద్ధపడ్తుంటే ఏమీ చెయ్యలేక నాలో నేనే ఎంతగానో కుమిలిపోతున్నాను. చంద్రపడియ వెళ్ళి వారిద్దరికి ముఖం చూపాలంటేనే భయంవేసి తప్పుకొంటున్నాను.

బిడ్డజీవితంకోసం తల్లిపడే కష్టాన్ని, చేసే త్యాగాన్ని సృష్టిలో మరెవ్వరూ చెయ్యలేరనే నా ఉద్దేశం.

ఒక అద్భుత దృశ్యం చిత్రించబడాలంటే కుంచెకు ఎంతటి ప్రాధాన్యత వుందో, ఒక జీవితాన్ని తీర్చిదిద్దగలిగే తల్లికంతే ప్రాధాన్యత వుంది. అలాంటి తల్లిని రక్షించుకోలేని నా అసమర్థతకు ఏ శిక్ష విధించినా యెలా చాలుతుంది?

ఎన్నో రాత్రులు భూమిని తాకి, నిండు వెన్నెల చల్లదనంతో వేద తీర్చే చంద్రునిలా, నా జీవితాన్ని అడుగడుగున స్పృశిస్తూ, నా




కోసం ఎన్ని చల్లని వెలుగుకిరణాలు నా కోసం వెచ్చించిందో చెప్పలేను.

ఇప్పటికీ వెన్నెల వెలుగులో మంచం వేసుకు పడుకొని, తెల్లని మేలిముసుగు కప్పిన ఆకాశదేవత నుదుటి బొట్టులావున్న పౌర్ణమి చంద్రుడ్ని చూస్తుంటే, అమ్మను చూస్తున్నట్లే వుంటుంది. చంద్రునిచుట్టూ మినుకు మినుకుమంటూ వెలిగే నక్షత్రాలు మధురజ్ఞాపకాల్లా నన్ను ఉత్తేజితుడ్ని చేస్తూనేవుంటాయి.

మూగసైగలు మాని మొదటిగా నే పిలిచిన పిలుపు కూడా "అమ్మ"నే.

నా ప్రతిపిలుపుకు సూర్యకిరణం తాకిన కమలంలా పరవశించి ప్రేమతో నా చిన్నారి ముఖాన్ని తన హృదయానికి హత్తుకొని పొంగి

పోయేది అమ్మ.

ఆ నాడు తన ఒడిలో యిముడ్చుకొని జోకొడుతుంటే, ఏ శక్తీ అమ్మనుంచి నన్ను విడదీయలేదన్నంత నిర్భయంగా ఆదమరచి నిద్రపోయేవాణ్ని. అమ్మ నా నమ్మకాన్ని కాపాడటానికి ఎన్ని రాత్రులు కంటిమీద కునుకు లేకుండా నన్ను కాచుకొని నిద్ర పుచ్చిందో.

ఎలాంటి బాధ్యతలు, బాదరబందీలు లేని ఆ వయసులో కమ్మని కలలు కనేవాణ్ని. నేడు-ఎదురౌతున్న సమస్యలు, బాధలు, నా కంట్లో ములుకుల్లా గుచ్చుతుంటే నే నెలా హాయిగా నిద్రపోగలను? కన్ను మూసిన ప్రతి క్షణం భవిష్యత్తనే పీడకలలు నన్ను నిద్రకు దూరం చేస్తున్నాయి.

ఆ నాడు చల్లని నా తల్లి ఒడలోవున్న నిశ్చలత్వం, ఈ నాడు పరిస్థితుల సుడిలో మునిగి తేలుతూ గిర్రున తిరిగే నాకు ఎలా లభిస్తుందంటావు?

చూసినదల్లా కావాలన్న పంతంలో విసిగిస్తుంటే బుజ్జగించి, అవన్నీ సమకూర్చి నా కళ్ళలో వెలిగే ఆనందజ్యోతుల్ని చూసుకోవటానికి అమ్మ ఎంత ఆరాటపడేదో మరువలేను. మరచిపోలేదు కూడా.

తుంటరితనంతో ఎంతగా ఏడ్పించినా భరించేదేగాని ఎన్నడూ హింసించేది కాదు. నా చిన్నారి చేష్టలు వీణారావంలా తన హృదయాన్ని మీటుతుంటే యెంతగా పరవశించిపోయేదో.

నాకు పదమూడేళ్ళ వయసప్పుడనుకొంటాను, నెలరోజులు విషజ్వరం సోకి చావు బ్రతుకుల మధ్య కొట్టుకులాడుతుంటే గుండె పగిలేలా ఏడ్చిందట. నిద్రాహారాలు మాని రేయింబవళ్ళు నన్ను కంటిరెప్పలా కాచుకొని బ్రతికించింది.

దేవుని దయవలననే నేను బ్రతికానని పొంగిపోయి, కానుకగా నా తలనీలాలు సమర్పించి, నాచే చేతులు జోడింపజేసి, తొలిసారిగా నాకు భగవంతుణ్ని పరిచయం చేసింది.

ప్రేమపూరితమైన స్పర్శతో ఆప్యాయంగా స్పృశిస్తూ, కంటిరెప్పలా కాచుకొంటూ, బిడ్డల ప్రతికష్టానికి చలించి, భవిష్యత్తుకోసం కొవ్వొత్తిలా కరిగి వెలిగిచ్చే అమ్మను మించిన వేరేదైవం వుందనుకోవడం ఆత్మవంచన కాక మరేమౌతుందంటావు? రాగమయి అయిన అమ్మతో పోలిస్తే ఆ భగవంతుడు కూడా వెలిగే ఒక చిరుదీపమే.

ఇప్పుడాలోచిస్తుంటే, ఆ నాటి మా పేదరికపు ముద్ర నా మనసుమీద పడకుండా అపురూపంగా నన్ను పెంచడానికి అమ్మా వాళ్ళెన్ని పూటలు పస్తులున్నారోనన్న తలంపు నా హృదయాన్ని ముక్కలుగా కోస్తుంది.

ఓ సారి——

ఢిల్లీలో వుద్యోగం చేస్తున్న మావయ్య ఇంటికొస్తూ ఆగ్రానుండి తాజ్‌మహల్ మోడల్‌ను తెచ్చి నాకు కానుకగా యిచ్చాడు.

అందంగా, తెల్లగా నిగనిగలాడుతున్న ఆ తాజ్ చూసి నేనెంతో మురిసిపోయాను. మావయ్య ఆ తాజ్ నా చేతికిస్తూ దీన్ని షాజహాన్ తన భార్య ముంతాజ్ స్మృతి చిహ్నంగా ఆగ్రాలో కట్టించాడని, అది ప్రపంచ ప్రసిద్ధి చెందిన కట్టడంగా పేరుగాంచినదని చెప్పినప్పుడు నాకో అనుమానం వచ్చింది.

"మావయ్యా! షాజహాన్‌కు తల్లి వుండిగదా! మరి ఆ తల్లి పేరున కూడా మరొకటి యెందుకని కట్టించలే"దని నేనంటే వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

ఆ వయసులో నాలో వున్నతంగా ఎదిగిన నా తల్లిరూపమే షాజహాన్ తల్లిపక్షాన నన్ను న్యాయం అడిగేలా చేసిందని యిప్పుడనిపిస్తుంది.

"అమ్మా! పెద్దవాణ్నై డబ్బు సంపాదించి నీ పేరుతో యిలాంటిదే కట్టిస్తాను" అని అమాయకంగా నేనంటే, అమ్మ నన్ను ఆనందంగా తన ఒడిలోనికి తీసుకొని ముద్దాడింది.

ఆ తర్వాత ఆ తాజ్ మోడల్‌ను భద్రంగా ఇంట్లో దాచి, రోజూ యెంతోసేపు దానికేసి చూస్తూ గడిపేవాణ్ని. దాన్ని చూస్తున్నప్పుడల్లా

అందులో అమ్మే నాకు కనిపించేది.

ఇప్పటికీ అది నా యింట్లో భద్రంగానే వుంది. కాని తాజ్‌ను చూడాలంటేనే నాకు భయం. నీ తల్లికోసం ఈ నాడు నువ్వు చేసిన త్యాగం ఏమిటి? అని నన్ను నిలదీసి ప్రశ్నిస్తున్నట్లుగా కలవరపడ్తాను.

నిజమే! నా తల్లి నా కోసం చేసిన త్యాగానికి బదులుగా నేనెంతో ఋణపడ్డాను. ఈ నాడు నా కాళ్ళమీద నేనీమాత్రమైనా నిలబడగలిగానంటే అది అమ్మ త్యాగఫలితమే.

కాలేజీలో చదివించడానికి నాన్న అంగీకరించకపోతే, ఎలాగైనా చదివించాలని పట్టుబట్టి, తనకున్న బంగారు నగలన్నీ అమ్మిపెట్టమని చిన్నాన్న చేతిలో పెట్టింది.

"వదినా! వున్నదంతా వాడికోసం ఖర్చుచేసి రేపు మీ కోసం ఏం మిగుల్చుకొంటారు? ఏ రోజు ఎలా వుంటుందో ఎవరు చెప్పగలరు? కష్టాల్లో వుంటే మిమ్మల్ని ఆదుకొంటాడని నమ్మకం ఏమిటి? మీ గురించి కూడా ఆలోచించుకోండి" అని చిన్నాన్నంటే నా కేసి చూస్తూ అమ్మ నవ్వింది.

అమ్మపై నాకున్న అభిమానాన్ని శంకిస్తుంటే చిన్నాన్నమీద కోపం వచ్చిందిగాని, అప్పటి చిన్నాన్న మాటల వెనుక ఎందరి జీవి

## రచయిత గురించి



స్వగ్రామం-తెనాలి తాలూకా కొలకలూరు.

చదివింది బి.యస్సీ. తెనాలి వి.యస్.ఆర్, అమరావతి ఆర్. వి. వి. యన్. కళాశాలలలో విద్యాభ్యాసం.

"గవర్నమెంట్ లెప్రసీ కంట్రోల్ యూనిట్"—కావలిలో మొన్నీమధ్యనే ఉద్యోగం. తద్వారా కుష్ఠురోగులకు సేవ చేసే అవకాశం.

పాఠశాలనుండి కళాశాల స్థాయివరకు క్రీడారంగంలోను, సాంస్కృతిక రంగంలోను ఎన్నో బహుమతులు. నాటికలు, నాటకాలు వ్రాసి ప్రదర్శిస్తూ ఉత్తమ నటుడిగా ప్రశంస.

రచయితగా చెప్పుకోదగ్గ రచనలు ఇంతవరకు లేవనే చెప్పాలి. సాహిత్యం నా ప్రాణం. చిన్నతనం నుండి సాహిత్యంతో కుస్తీ పడుతూనే, ఎన్నో కథలు తిరిగొస్తున్నా, ఆ స్థాయికి ఎదగలేదని నన్ను విమర్శించుకొంటూ నిరాశచెందక కృషిచేస్తూ వచ్చాను.

"చక్రవర్తి" మాసపత్రిక డిసెంబర్ 78లో ప్రచురితమైన నా మొదటి కథ "సశేషం"కు ఆ పత్రిక నిర్వహించిన పోటీలలో బహుమతి వచ్చింది. "తాజ్ మహల్!" నా రెండవ కథ.

ఆర్థికలేమి వలన బిడ్డల ప్రేమానురాగాలకు దూరమవుతున్న ఎందరో మధ్యతరగతి తల్లిదండ్రులను పరిశీలించిన అనుభవమే ఈ కథకు ప్రేరేపణ.

తాలను పరిశీలించిన అనుభవం దాగుందో యిప్పుడు బోధపడుతుంది.

ఆ నాడు అమ్మ గనుక తన స్వార్థం గురించే ఆలోచించివుంటే, ఈ నాడు నా సహాయం మీద ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడేది కాదు. మందులు కొనుక్కోలేక అనారోగ్యంతో నరకయాతన అనుభవించేది కాదు.

నా చదువు ఖర్చులకు, ఇంటి ఖర్చులకు యిబ్బంది పడుతుంటే అమ్మ నూలు వడకటం నేర్చుకొంది. సెలవలకు ఇంటికెళ్ళినప్పుడు చరకాచక్రాల శబ్దం బరబరమంటూ ఇల్లంతా మ్రోగుతుండేది.

రాత్రిళ్ళు అమ్మ చరకా తిప్పేశబ్దం నన్ను నిద్రకు దూరంచేసేది. నా కోసం అమ్మ కష్ట పడుతుంటే నిద్రపోవాలనిపించక వెళ్ళి అమ్మ ఎదురుగా కూర్చునేవాణ్ని.

నిద్రతో కళ్ళు తూగుతున్నా, అలసటను లెక్కించకుండా యంత్రంలా పనిచేసే అమ్మను చూస్తుంటే నా కళ్ళల్లో నీళ్ళు నిలిచేవి. పైట కొంగు అందుకొని ముఖంపైవున్న చెమటను అద్దేవాడ్ని. ఆ క్షణాల్లో; తనంతవరకు పడిన శ్రమనంతా మర్చిపోయి నాకేసి ప్రేమగా చూసే అమ్మకళ్ళల్లో రెండు చంద్రబింబాలు వెలుగు తున్నట్లనిపించేది.

"అమ్మా! ఇంత రాత్రివరకు నిద్ర మేల్కొంటే నీ ఆరోగ్యం ఏమవుతుంది? ఇక విశ్రాంతి తీసుకోమ్మా!" అంటూంటే, ఏమీ శ్రమ ఎరుగనట్లు హాయిగా నవ్వగలిగే అమ్మను చూస్తుంటే సకల చరాచర జగతిని భరించే భూగోళం గుర్తొచ్చేది.

కదలకుండా తన ఎదురుగా కూర్చున్న నా కోసం అమ్మ చరకా ప్రక్కనపెట్టి, నన్ను నిద్రపొమ్మని తనూ పడుకొనేది. ఇంకా చీకటి విచ్చుకొనకముందే మెలుకువ వచ్చి బరబరా తిరుగుతున్న చరకాశబ్దం వింటున్నప్పుడు, నా కంటినుండి నీరు జలలా వూరుతూ దిండులో యింకిపోతుండేది.

పువ్వు యితరులకోసం వాసన నూనెగా మారాలంటే రెకురేకును అర్పించి, ఆకృతినే కోల్పోయి తననే అర్పించుకోవాలి. అలానే అమ్మ నా కోసం తన ఆరోగ్యపు అణువణువును హరింపజేసుకొని అనారోగ్యాన్ని తెచ్చుకొంది.

సముద్రంలా విశాలంగావున్న అమ్మప్రేమ స్వరూపాన్ని బిందువు బిందువుగా విడదీసి ఎన్నని లెక్కబెట్టి చెప్పగలను? నా చూపు కందనంతగావున్న అనురాగపు లోతును పరి శీలించి అర్థంచేసుకోవటానికి బలహీనమైన నా దృష్టిని యెన్ని యుగాలని నిలిపివేచి వుండ గలను?

తల్లిదండ్రులను నా దగ్గరే వుంచుకొని ఏ లోటు రాకుండా చూసుకోవాలనే ఆలోచన ఓ చిన్న గుమస్తాగా జీవితంలో ఇరుక్కొన్న నాకు ఎంత కష్టమైనదో—పెళ్ళిచేసుకొని, పిల్లలు పుట్టిన తర్వాతగాని తెలిసిరాలేదు.


మూడువందల ఆదాయంమీద ముగ్గురు పిల్లలతో ఒక పట్నంలో బ్రతకటం ఎంత కష్ట సాధ్యమో నీకు తెలియంది కాదు.

నాన్నగారు రిటైర్ అయినాక వచ్చే పెన్షన్ డబ్బు చాలక యిబ్బంది పడ్తున్నారని గ్రహించి, వాళ్ళకేమీ సహాయం చెయ్యలేకపోతున్నం దుకు వేదనపడేవాణ్ని.

ఏనాటి కానాడు సమస్యలు సాలెగూడులా అల్లుకొని వాళ్ళకు నన్ను దూరం చేస్తూనే వచ్చాయి. ఆ దూరం నానాటికి అంతరిక్షంలో తరగని దూరంలా పెరిగిందేకాని మమ్మల్ని ఒకటిగా చెయ్యలేదు.

వాళ్ళిద్దర్నీ మనదగ్గరే వుంచుకొందామని అనేకసార్లు కళ్యాణికి నచ్చజెప్పజూస్తే ఎంతో గొడవచేసింది. మన బ్రతుకులే మనకు భారంగా ఏడుస్తుంటే వాళ్ళ బరువు మనమెక్కడ మొయ్యగలమని కసురుకొనే కళ్యాణిని రాక్ష సిగా వూహించుకొన్నాను. కాని ఆలోచిస్తే, తన సంసారంపట్ల పెంచుకొన్న అభిమానమే తన చేత అలా మాట్లాడిస్తుందనిపించేది.

నన్ను కన్నవారిపై నాకున్న ప్రేమను అర్థంచేసుకొని కష్టాల్ని ఎదుర్కొగల ధైర్యం కళ్యాణికి లేదు. నా బాధను, బాధ్యతను




భార్యగా ఏ మాత్రం అర్థంచేసుకోలేక పోయింది.

స్త్రీ తల్లిగా తన బాధ్యతను నిర్వర్తించగలిగి నంత వున్నతంగా, న్యాయంగా భార్యగా నిర్వర్తించలేదేమోనని కళ్యాణిని పరిశీలిస్తుంటే నా కనిపించింది. స్త్రీలో భార్యరూపంకన్నా తల్లి రూపమే వున్నతమైనది.

కళ్యాణి ఒక విధంగా పిచ్చిదే సుందరం!

నా మీద అమ్మయితే ఆశలు పెట్టుకొందో లేదో చెప్పలేనుగాని, తన సంతానంమీద కళ్యాణి మాత్రం ఆశలు పెంచుకొంటుందేమోననిపిస్తుంది. కొడుకుగా, నేను అమ్మకు ఎంత ఆదరణ, ఆశ్రయం కల్పించాలో రేపు తన కొడుకులూ అంతే ఆశ్రయం కల్పిస్తారని కళ్యాణి గ్రహించలేకపోవటం పిచ్చిగాక మరేమిటంటావు?

ప్రేమను పంచుకోవాలన్నా, దూరం చేసుకోవాలన్నా మన మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక స్థితి ఎంతో ప్రాముఖ్యం వహిస్తుంది. మధ్యస్థ కుటుంబాల్లో ఆశలు పెట్టుకొని సంతానాన్ని తీర్చిదిద్దుకొనే తల్లిదండ్రులకు ఇలాంటి సమస్యలు ఎంతో క్షోభను కలిగిస్తాయి.

అమ్మ ఆరోగ్యం బాగోలేదని నాన్న వుత్తరం రాస్తే చార్జీలకు అప్పుచేసి చంద్రపడియ వెళ్ళాను.

పచ్చనిమ్రాను నేలకూలితే శుష్కించినట్లుగా శరీరం వాడిపోయివుంది. ఎముకల గూడులా మంచాని కంటుకొనివున్న అమ్మను చూస్తుంటే నా హృదయం నీరైపోయింది.

డాక్టర్ ఆపరేషన్ చెయ్యాలన్నాడని, అందుకు కనీసం వెయ్యిరూపాయలు ఖర్చవుతుందని నాన్నంటే నేను మౌనంగా వూరుకొన్నాను. అంత డబ్బు నా దగ్గరెక్కడిది? ఒక్కసారిగా ఎక్కడ తేగలను?

నా అశక్తతను అర్థంచేసుకొన్న అమ్మ ఏమందో తెలుసా! "ఏవండీ! పండుటాకు ఏ నాటికైనా రాలిపోక తప్పదు. నాలుగు రోజులు నన్నెక్కువ బ్రతికించాలన్న తాపత్రయంతో వాడ్ని అప్పులపాలు చెయ్యకండి. వాడి తాహతు ఎంతో మనకు తెలియదా?"

అంటే, అమ్మ పాదాలమీదపడి భోరున ఏడవాలనిపించింది.

అమ్మను రక్షించుకొనే శక్తిలేక పిరికివాడిలా పారిపోయి తిరిగొస్తూ వెళ్ళొస్తానని అమ్మతో చెప్పినప్పుడు, కడసారిగా అన్నట్లు నన్ను ఆపాదమస్తకం తడిమిన అమ్మచూపులో దీవెనను, వాత్సల్యాన్నే చూడగలిగాను కాని నా చేతగానితనం ఎడల ఏవగింపును ఏమాత్రం చూడలేదు.

చంద్రపడియ నుండి తిరిగొచ్చి డబ్బుకోసం ఎంతో ప్రయత్నించాను. సంసారం కోసం అంతకుముందే చేసిన అప్పులు తీర్చలేని నాకు తిరిగి ఎవరు అప్పిస్తారు? ఎంతమంది నడిగినా మొండిచేతులు చూపించారు. నా తల్లి కోసం ఏమీ చెయ్యలేక నాలో నేనే కుమిలిపోవటం మినహా ఏం చెయ్యగలను?

ఇప్పటికే చాలా రాశాను కదూ! నీకు విసుగనిపించడంలేదు గదా! నీ స్నేహ హృదయం నా వేదనను ఇముడ్చుకోగలుగుతుందనే నా దృఢనమ్మకం. ఇక కొద్దిలోనే ముగిస్తాను.

షాజహాన్ తాజ్‌మహల్‌ను నిర్మించి భార్యపై తనకున్న ప్రేమను వ్యక్తంచేసి, వారిద్దరి ప్రేమను చరితార్థంచేసి కృతార్థుడయ్యాడు.

షాజహాన్ నాలా పేదవాడై వుంటే ఏం చేసేవాడు? ప్రేమవుండి తల్లిని కోల్పోబోతున్న నేను ఏడుస్తున్నట్లే, భార్యను పోగొట్టుకొన్న అతనూ దుఃఖిస్తాడు. అప్పుడు అతని ప్రేమను ఈ ప్రపంచంలో ఎందరు గుర్తించగలిగేవాళ్ళు?

తాజ్‌ను నిర్మింపజేసింది కేవలం అతని ప్రేమైక హృదయమేకాదు, అతనికందుబాటులో వున్న అంతులేని సంపద కూడా.

షాజహాన్‌లా తనవారి యెడల ప్రగాఢమైన ప్రేమను కలిగివున్న వారెందరో ఈ సృష్టిలో వున్నారన్నది యదార్థం. అయితే ఈ షాజహాన్‌లెవ్వరూ తమ ప్రేమను వ్యక్తం చెయ్యగలిగే తాజ్‌మహల్‌ను నిర్మించలేకపోయారు.

వారి ప్రేమకు లోపించిన ఆర్థిక దుర్బలత్వమే అందుకు కారణం కాదని ఎవరైనా అనగలరా? వారందరూ సంపన్నులై వుంటే, తొలిగా ప్రేమ చిహ్నం నిర్మించిన షాజహాన్ ఈ చరిత్రలో మొదటి వాడయ్యేవాడే కాని, ఒక్కడుగా మాత్రమే గుర్తింపు పొందేవాడు కాదు.

నా లాంటి నిర్భాగ్యుడ్ని కన్నతల్లి-కనీసం తన ఆరోగ్యాన్నయినా రక్షించుకోలేని దౌర్భాగ్యాన్ని ఎలా పొందిందో, అంతటి షాజహాన్ చక్రవర్తిని కొడుకుగా కన్న తల్లి-తన పేరున ఏ స్మృతిచిహ్నాన్ని నిలుపుకోలేక అంతటి దౌర్భాగ్యాన్నే పొందింది.

చరిత్రలో షాజహాన్ కాదు, మరే చక్రవర్తి తల్లికోసం స్మృతిచిహ్నం నిర్మించి తల్లిని గౌరవించలేకపోయారు. చిన్నతనంలో నేనన్నట్లుగా, అమ్మకోసం మరో తాజ్ మహల్‌ను నిర్మించే శక్తి నాకు లేకున్నా, కనీసం బ్రతికించుకొనే శక్తికూడా లేని పేదవాడినయ్యాను.

భార్యకోసం స్మృతిచిహ్నం కట్టలేకపోవడం ఎవరైనా క్షమించగలరేమోగాని, తల్లిని బ్రతికించుకోలేని నా అసమర్థతను ఎవరూ క్షమించకూడదనే భావిస్తాను.

ఈ జన్మలో అమ్మను ఆదుకోలేకపోయిన నేరానికి శిక్షను నాకూ, కళ్యాణికి మా బిడ్డలు తప్పక విధిస్తారు. ఎందుకంటే నా బిడ్డలు నా కంటే వున్నతంగా, సంపన్నంగా బ్రతికే స్థాయి ఈ సమాజంలో, ఈ వ్యవస్థలో వారికి లభించదు గనుక.

మరో జన్మంటూ వుండి, నేను సంపన్నుడిగా పుడితే మాత్రం మొదటిగా నా తల్లినే గౌరవిస్తాను. తల్లి యొక్క ప్రేమ స్వరూపాన్ని ఈ ప్రపంచం గుర్తించేలా చేస్తాను.

నా మనసులోని భావాలు నీతో యిలా చెప్పుకోగలిగినందుకు మాత్రం కొంత తృప్తిగా వుంది.

—రాఘవ

ఉత్తరం చదవడం ముగించి కవర్లో పెట్టి సూట్‌కేస్‌లో పడేశాను. నా హృదయం బాధతో బరువెక్కింది. తన తల్లిపై రాఘవకున్న

ప్రేమ ఎవరెస్ట్ శిఖరమంత వున్నతంగా నా మనసులో నిలిచింది.

"రాఘవ తల్లిని బ్రతికించాలి? రాఘవ పేదరికం ఆమెను బలితీసుకోకూడదు" అలోచనలతో నా బుర్ర వేడెక్కింది.

ఏదో స్టేషను దగ్గరపడుతున్నందువలన బండి వేగం తగ్గింది. లోపలవున్న ప్రయాణీకులు కొందరు ఆదుర్దాగాలేచి సామాను సర్దుకొంటున్నారు.

ఎక్స్‌ప్రెస్ కావలి చేరాల్సిన సమయం అయిదుగంటల నలభై అయిదు నిమిషాలే అయినా, బండి స్టేషన్‌లో ఆగేసరికి ఏడుగంటలైంది. రాఘవతో చంద్రపడియ వెళ్ళి రాఘవ తల్లిని తీసుకొచ్చి హాస్పటల్లో చేర్చాలని నా ఉద్దేశం.

రిక్షా చేసుకొని రాఘవ యింటికి వెళ్ళాను.

వాకిట్లో అడుగు పెట్టగానే కనపడ్డ దృశ్యం నన్ను నిలబెట్టింది. రాఘవ అరుస్తూ తన కొడుకును గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు. మిగతా యిద్దరు పిల్లలు, వాడి భార్య రాతిబొమ్మల్లా నిలబడి చూస్తున్నారు.

"రాఘవా!" అరిచాను గట్టిగా.

నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. దెబ్బలు తింటున్న రాఘవకొడుకు భయంగా తల్లిని చుట్టేసుకొని వెక్కిళ్ళుపెడ్తూ ఏడుస్తున్నాడు.

గడ్డం బాగా మాసిన రాఘవముఖం కళాకాంతులు లేకుండా దీనంగా వుంది. వాడి కళ్ళనుండి స్రవించే కన్నీటి జాలు అనంతంగా తోచింది నాకు.

"ఎందుకురా వాణ్నలా కొడ్తున్నావ్?" మందలింపుగా అన్నాను.

"సుందరం! తాజ్ నా ప్రాణం. నీకు తెలుసుగదా! వాడు దాన్ని క్రిందపడేసి ముక్కలు ముక్కలు చేసేశాడు. చూడరా! నా హృదయం క్రిందపడి ఎలా చితికిపోయిందో" దుఃఖంతో రాఘవ గొంతు బిగుసుకుపోయింది.

ఆకృతిలేకుండా చిన్నాభిన్నమైన తెల్లని తాజ్ ముక్కలు, దండనుండి రాలినపూసల్లా వున్నాయి. నా మనసు చివుక్కుమంది.

"బాధపడకు రాఘవా! పిల్లలు పొరపాట్లు చేయరా? మనం వెంటనే చంద్రపడియ వెళ్ళి అమ్మను తీసుకొచ్చి హాస్పటల్లో చేరుద్దాం. ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బు నేను తెచ్చాను. అమ్మ తప్పక బ్రతుకుతుంది" తొందర చేస్తున్నట్లుగా అన్నాను.

రాఘవ ముఖంలో రంగులు మారాయి. వాడి పెదాలు బలవంతంగా విచ్చుకొంటే అది నవ్వో, ఏడుపో నా కర్థంకాలేదు. ఓ నిమిషం తర్వాత ఏడుస్తూ కుప్పలా కుర్చీలో కూలబడ్డాడు.

వాడు జేబునుంచి తీసిచ్చిన ఎర్రటి టెలిగ్రాం కాగితాన్ని అందుకొంటుంటే నా చేతులు వణికాయి.

"టెలిగ్రాం వచ్చి గంట నేపైనా అందరం వెళ్ళటానికి చార్జీ డబ్బులేక అయోమయంగా ఏడుస్తున్నానురా. నువ్వు తెచ్చిన డబ్బు ఇప్పుడు అమ్మను బ్రతికించలేదు. జీవంలేని ఆమె శరీరాన్ని కాలుస్తుంది" నా చేతుల్లో ముఖాన్ని దాచుకొని చిన్నపిల్లవాడిలా వలవలా ఏడవసాగాడు రాఘవ.

---

## అంకితం

తప్పటడుగులు వేసే నాటినుండి నేటివరకు
నాకు చేయూతనిస్తూ నా జీవితానికి
వెలుగుబాట వేసిన

అమ్మ
శ్రీమతి సరోజినిదేవి

నాన్న
శ్రీ వెంకటేశ్వరరావు లకు

ప్రేమతో —